నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | నల్లగొండ, ఆదివారం 11 మే 2025 | YADADRI BHUVANAGIRI

# మన రక్షణ రంగం ఎంతో బలోపేతమైంది

- ప్రజలు భయపడాల్సిన పని లేదు.. పాక్‌తో యుద్ధం రోజుల వ్యవధిలోనే ముగుస్తుంది
- భారత సైన్యానికి అండగా ఉండేందుకు మేము సిద్ధం
- బార్డర్‌లో ఉన్న సైనిక కుటుంబాలకు మేమున్నామనే భరోసాను దేశ ప్రజలు ఇవ్వాలి
- తెలంగాణలో మాజీ సైనికులను పట్టించుకోవడం లేదు
- నమస్తే తెలంగాణతో అఖిల భారత పూర్వ సైనిక్ సేవా పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు, రిటైర్డ్ కల్నల్ సుంకర శ్రీనివాసరావు


రిటైర్డ్ కల్నల్ సుంకర శ్రీనివాసరావు

సూర్యాపేట టౌన్, మే 9 : 'ప్రజలు భయపడాల్సిన పనిలేదు. మన రక్షణ రంగం ఎంతో బలోపేతమైంది. పాక్‌తో యుద్ధం రోజుల వ్యవధిలోనే ముగుస్తుంది.' అని సూర్యాపేట జిల్లా మునగాల మండలం విజయరాఘవాపురం గ్రామానికి చెందిన కల్నల్ సుంకర శ్రీనివాసరావు అన్నారు. భారత సైన్యానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా అండగా ఉండేందుకు తాము సిద్ధమని చెప్పారు. 1988 నుంచి 2021 వరకు ఇండియన్ ఆర్మీలో పని చేసి లెఫ్టినెంట్ కల్నల్ హోదాలో ఉద్యోగ విరమణ పొందిన శ్రీనివాసరావు.. 1999లో జరిగిన కార్గిల్ యుద్ధం లో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. నాటి యుద్ధ పరిస్థితిని, అనుభవించిన బాధలను, ప్రజల కోసం ఎలా రక్షణగా నిలిచారు. ప్రస్తుతం జరుగుతున్న ఆపరేషన్ సింధూర్ విజయవంతానికి కారణాలను, ప్రజల బాధ్యతను నమస్తే తెలంగాణకు వివరించారు. అవి ఆయన మాటల్లోనే..

### రక్షణ రంగం బలోపేతమే మన విజయానికి కారణం

నేను పని చేస్తున్న సమయంలో 1999లో కార్గిల్ యుద్ధం జరిగింది. నాడు రక్షణ రంగం బలంగా లేకున్నా ఆయుధాలు తక్కువగా ఉన్నప్పటికీ పాకిస్తాన్‌పై వీరోచితంగా పోరాడి విజయం సాధించాం. కార్గిల్ యుద్ధంలో డ్రోన్ టెక్నాలజీ, యాంటీ మిసైల్ డిఫెన్స్ సెక్యూరిటీ బలంగా లేదు. మనకు ఉన్న అగ్ని, ఆకాశ్ మిసైల్స్ అన్నీ గత 20 ఏండ్లల్లో తయారు చేశారు. మన సాంకేతిక రక్షణ రంగం డీఆర్‌డీఏ, డీఆర్‌ఎంఎల్, ఆర్‌డీఏ ప్రభుత్వ పరిశోధన రంగ సంస్థలన్నీ హైదరాబాద్‌లోని డిఫెన్స్ విభాగాలు.. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం ప్రేరణతో ఆయన నాయకత్వంలో క్షిపణులు, రాకెట్లు రోదసీలోకి పంపేందుకు డిజైన్ చేయడం నేర్చుకున్నారు. ఫోక్రాన్ యుద్ధం న్యూక్లియర్ బాంబు పేలుడు తరువాత మన సాంకేతిక రంగాన్ని అభివృద్ధి చేసుకొని ఫారెన్ టెక్నాలజీతో మన దేశ రక్షణ సంస్థలు బీడీఎల్, ఎస్ఈఎల్, బీఈఎల్ మిసైల్స్‌ను తయారు చేస్తున్నాయి. రంగంలో పటిష్టంగా, పకడ్బందీగా పాకిస్తాన్‌పై డ్రోన్‌లను తిప్పికొడుతూ యాంటీ మిసైల్స్ స్క్వాడ్స్ చేస్తున్నామంటే మన రక్షణ రంగం సాకేతికంగా అభివృద్ధి చెందడం వల్లే. దాంతోపాటు త్రివిధ దళాలు సమాన దృష్టితో, సమతుల్యంతో భారత ప్రభుత్వం గాలి, నీరు, భూమిపై మూడు విభాగాలను పటిష్టంగా తయారు చేసింది. పాకిస్తాన్‌తో ఏదో ఒకరోజు ఇలాంటి థ్రెట్ వస్తుందని తెలుసు. మనకు మనం పటిష్టంగా ఉండాలనే ఆలోచనతో పదేండ్లలో యాంటీ డ్రోన్‌లు, యాంటీ మిసైల్స్ తయారు చేసుకోవడమే ఈ రోజు మన విజయానికి కారణం.

### పాకిస్థాన్‌తో యుద్ధం కొన్ని రోజులు మాత్రమే..

భారతదేశం పాకిస్థాన్‌తో చేసే యుద్ధం కొన్ని రోజులు, వారాలు మాత్రమే. నెలలు కూడా పోయే పరిస్థితి లేదు. ఇప్పుడు పాక్ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నంగా ఉంది. పాక్ ఆర్థిక వ్యవస్థ, ప్రభుత్వం, సైన్యం మూడూ గాడి తప్పాయి. రష్యా, ఉక్రెయిన్ మాదిరిగా పాశ్చాత్య దేశాలు పాకిస్తాన్‌కు మద్దతు ఇచ్చే పరిస్థితి లేదు. దుబాయ్, చైనాతో కలుపుకొని ఏదో చేయాలని చూస్తే భారతదేశం పాకిస్తాన్‌ను ప్రపంచం దృష్టిలో ఏకాకిని చేసే ఉద్దేశమే ఈ దౌత్యం. అమెరికా, రష్యా, ఫ్రాన్స్, ఇటలీ, ఇజ్రాయిల్ ప్రపంచ అగ్రగామి దేశాలన్నీ మన వెంట ఉన్నాయి. ఈ సమయంలో పాకిస్థాన్‌కు చైనా మద్దతు ఇచ్చి యుద్ధ సామగ్రి, ఆర్థికంగా సహకరిస్తే.. రేపు 140కోట్ల మంది భారతీయులు చైనా వస్తువులను బహిష్కరిస్తే ఆ దేశ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోతుంది. అందుకే చైనా ఎట్టిపరిస్థితుల్లోనూ పాకిస్థాన్‌కు మద్దతు ఇవ్వదు. బార్డర్‌లో మీరున్నారు.. బార్డర్ బయట మేమున్నామని భారత ప్రభుత్వానికి, రక్షణ రంగానికి మద్దతు తెలుపాలి. సైనికులు ఎలాంటి భయ భ్రాంతులకు గురికాకుండా యుద్ధం చేయాలని సామాన్య ప్రజలు కూడా భయాందోళన చెందకుండా స్లీపర్ సెల్స్ యాక్టివ్ కాకుండా మన ప్రాంతాలను మనమే రక్షించుకోవాలి. మన పోలీసు, రక్షణ వ్యవస్థకు సమాచారం అందించి సహకరిస్తూ ఇంటర్నల్ ఎటాక్‌లకు చెక్ పెట్టాలి.

### రాష్ట్ర ప్రభుత్వం మమ్మల్ని మరిచినా.. మా బాధ్యతను మరువం

రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నేటికీ రాష్ట్రానికి హోం శాఖను కేటాయించలేదు. మాజీ సైనికుల సమస్యలపై ఎన్నిసార్లు విన్నవించినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు. దేశం కోసం పాటుపడిన సైనికుల సమస్యలను పరిష్కరించకున్నా వారికి కాసేపు సమయం ఇచ్చే పరిస్థితి లేదు. ప్రభుత్వం మమ్మల్ని మరిచినా.. మేం మా బాధ్యతను మరు వం. భారతదేశ సైన్యానికి, ప్రజలకు ఎప్పుడు ఎలాంటి ఆపద వచ్చినా ప్రత్యక్షంగా, పరోక్షంగా పోరాడేందుకు మాజీ సైనికులమంతా సిద్ధంగా ఉంటాం.

### కల్నల్ సుంకర శ్రీనివాసరావు సైనిక జీవితం

శ్రీనివాసరావు 1988నుంచి 2004 ఇండియన్ ఆర్మీ (కార్ప్స్ ఆఫ్ సిగ్నల్స్)లో చేరి ఇండియన్ మిలటరీ అకాడమీ నుంచి డెహ్రాడూన్‌కు లెఫ్టినెంట్ కమిషన్ అయ్యారు. 2005నుంచి 2006 వరకు దేశంలోని ఐదు రాష్ట్రాలైన నార్త్ ఈస్ట్‌లో కంపెనీ కమాండర్‌గా కౌంటర్ ఎమర్జెన్సీ ఏరియాల్లో లెఫ్టినెంట్ అండ్ కెప్టెన్ ర్యాంకుల్లో పనిచేశారు. 2007లో హైదరాబాద్‌లో జరిగిన 3వ మిలటరీ వరల్డ్ గేమ్స్ పోటీకి అసిస్టెంట్ డైరెక్టర్‌గా కెప్టెన్ ర్యాంకులో పని చేశారు. 2007–08లో నాగపూర్‌లోని కాంప్టీలో జడ్జి అడ్వకేట్ జనరల్ బ్రాంచి ఇండియన్ మిలటరీ లా ఇన్‌స్టిట్యూట్ నుంచి పట్టభద్రుడయ్యారు. 2006 నుంచి 2009 వరకు అడ్మినిస్ట్రేటివ్ కేడర్‌లో కెప్టెన్, మేజర్‌గా పనిచేశారు. 2009 నుంచి 2011 వరకు మిషన్ ఒలింపిక్స్ కోసం మేజర్, శిక్షణాధికారిగా పూణెలో ఇండియన్ ఆర్మీ మిషన్ ఒలింపిక్ వింగ్ కోసం ఆఫీసర్ ఇన్‌చార్జిగా పని చేసి 20వేల మంది సైనికులకు శిక్షణ ఇచ్చారు. 2015నుంచి 2017వరకు లెఫ్టినెంట్ కల్నల్ హోదాలో శారీరక శిక్షణ, క్రీడల అధికారిగా గ్రానేడియర్స్ రెజిమెంటల్ సెంటర్‌లో బోధకుడిగా పని చేశారు. 2017–21 మధ్య లెఫ్టినెంట్ కల్నల్ హోదాలో ఆర్మీ ఆర్డెన్స్ ట్రైనింగ్ సెంటర్‌లో ఫిజికల్ ట్రైనింగ్ సెంటర్‌లో ఫిజికల్ ట్రైనింగ్ అండ్ స్పోర్ట్స్ ఆఫీసర్‌గా పని చేసి 35వేల మంది సైనికులకు శిక్షణ ఇచ్చారు.

### 15వరకు టీఎస్ ఐసెట్ దరఖాస్తు ఫీజు గడువు పెంపు

రామగిరి, మే 10 : తెలంగాణ వ్యాప్తంగా ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే టీఎస్ ఐసెట్ –2025 ప్రవేశ పరీక్ష దరఖాస్తుల గడువును ఈ నెల 15వరకు పెంచినట్లు సెట్ కన్వీనర్, మహాత్మాగాంధీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ అల్వాల రవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అపరాధ రుసుము లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చని, అర్హులైన విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### 31లోగా బీఆర్‌ఏఓయూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షల ఫీజులు చెల్లించాలి

రామగిరి, మే 10 : బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ 2వ, 4వ, 6వ సెమిస్టర్ చదివే విద్యార్థులు ఈ నెల 31లోగా పరీక్ష ఫీజులు చెల్లించాలని ఎన్జీ కళాశాల ప్రిన్సిపాల్ ఉపేందర్, రీజినల్ కో ఆర్డినేషన్ సెంటర్ కో ఆర్డినేటర్ అంతటి శ్రీనివాసులు శనివారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు www.braou.ac.inలో గానీ, నల్లగొండలోని కో ఆర్డినేషన్ సెంటర్‌లో గానీ సంప్రదించాలని సూచించారు.

# సన్నాల్లేవ్.. బోనస్ లేదు



## సర్కారు రూ.500 బోనస్ ఉత్తముచ్చటే

**సన్నాలకు సర్కారు రూ.500 బోనస్ ఉత్తముచ్చటగానే మిగిలిపోతున్నది. తొలుత అన్ని పంటలకు బోనస్ అని మోసపు మాటలు చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం.. అమల్లో మాత్రం సన్నాలకే అంటూ సన్నాయి నొక్కులు నొక్కి రైతులకు తీరని నష్టం మిగిల్చింది. జిల్లాలో సన్నాల దిగుబడి అంతంతే రాగా.. ప్రభుత్వం కొన్నది కూడా ఏమీ లేదు. తాలు, తేమ, గింజ పొడవు అంటూ అనేక కొర్రీలు పెడుతుండటంతో పండిన కొద్దిపాటి ధాన్యాన్ని కూడా ప్రైవేట్‌లోనే అమ్ముతున్న దుస్థితి నెలకొంది.**

– యాదాద్రి భువనగిరి, మే 10 (నమస్తే తెలంగాణ)

- జిల్లాలో సన్నాలు కొన్నది 200 మెట్రిక్ టన్నులే
- అధిక శాతం రైతులు దొడ్డు వడ్ల వైపే మొగ్గు
- నాడు అన్ని పంటలకు బోనస్ అని కాంగ్రెస్ ప్రగల్భాలు
- అధికారంలోకి వచ్చాక సన్నాలకేనని సన్నాయి నొక్కులు
- ప్రభుత్వ తీరుతో కోట్లల్లో నష్టపోతున్న అన్నదాతలు

యాదాద్రి భువనగిరి జిల్లాలో ప్రస్తుత యాసంగి సీజన్‌లో 2.80లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. మొత్తంగా 6.5లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశా రు. ఈ సీజన్‌లో నాలుగున్నర లక్షల టన్నుల వడ్లు సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఇందుకోసం జిల్లాలో 327 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఇప్పటి వరకు జిల్లా అంతటా 1.60 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు కొనుగోలు చేశారు. అనేక చోట్ల కేంద్రాలు ప్రారంభించినా.. కొనుగోళ్లలో జాప్యం నెలకొంటున్నది. దీంతో కొనుగోలు కేంద్రాల్లో ఎక్కడ పోసిన ధాన్యం అక్కడే కుప్పలుగా దర్శనమిస్తున్నాయి.


ఆత్మకూర్‌లో కొనుగోలుకు సిద్ధంగా ఉన్న ధాన్యం

### దొడ్డు రకం వైపే మొగ్గు..

యాసంగి సీజన్ కావడంతో రైతులు ఎక్కువగా దొడ్డు రకానికే మొగ్గు చూపారు. ముఖ్యంగా మూసీ బెల్ట్‌లోని బీబీనగర్, భూదాన్ పోచంపల్లి, వలిగొండ, రామన్నపేట మండలాల్లో 99శాతం దొడ్డు రకాలే వేస్తారు. ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించినా సన్నాలు వేసేందుకు రైతులు ముందుకు రాలేదు. వరి ధాన్యం ఏ గ్రేడ్ రకం క్వింటాల్‌కు గతేడాది రూ.2,203 చెల్లించగా, ఈ సారి 2,320 రూపాయలు మద్దతు ధరగా ప్రకటించారు. సాధారణ ధాన్యానికి క్వింటాల్‌కు పోయినసారి రూ.2,183 ఉండగా, ఈ సారి 2300 రూపాయలకు పెంచారు. ఈ లెక్కన సన్న, దొడ్డు రకాలకు మధ్య తేడా రూ.117 మాత్రమే. ఇక దొడ్డు రకాలతో పోలిస్తే సన్న రకాల పంటకాలం 15 నుంచి 20 రోజులు అధికంగా ఉంటుంది. దీంతో దిగుబడి చేతికొచ్చి.. విక్రయించే సమయంలో అకాల వర్షాలు పడుతాయేమోనని కొందరు రైతులు ఆందోళన చెందుతున్నారు. సన్నాలకు దోమపోటు అధికం. రసాయన మందుల పిచికారీ వల్ల పెట్టుబడి వ్యయం పెరుగుతుంది. యాసంగి సన్న వడ్లను బియ్యంగా మార్చే సమయంలో నూక శాతం ఎక్కువగా వస్తుందని పలువురు పేర్కొంటున్నారు.

### సన్నాలు కొన్నది 200 మెట్రిక్ టన్నులే..

ఈ సారి వ్యవసాయ శాఖ కార్యాచరణలో సన్నాల సాగు లేదని పేర్కొనడం విశేషం. గతంలో ధాన్యం కొనుగోళ్లలో సన్నాల కోసం ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సారి పంట లేదంటూ ప్రత్యేక సెంటర్లను ఏర్పాటు చేయలేదు. సాధారణ కేంద్రాల వద్దే ఎవరైనా విక్రయించవచ్చని సివిల్ సప్లయ్ అధికారులు చెబుతున్నారు. ధాన్యం లేనప్పుడు సపరేట్‌గా ఏర్పాటు చేసినా లాభం ఉండదని పేర్కొంటున్నారు. అయితే.. పండించిన ధాన్యంలో కొంత రైతుల సొంతానికి పోగా మిగిలింది విక్రయిస్తున్నారు. ఇప్పటి వరకు 200 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. అయితే బోనస్ కోసం సర్కారులో అమ్ముదామంటే అనేక కొర్రీలు పెడుతుంది. దీంతో కొందరు బయట ప్రైవేట్ వ్యాపారుల వద్ద అమ్ముకుంటున్నారు.



### సర్కారు మోసపు మాటలతో కోట్లల్లో నష్టం

కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల ముందు అన్ని రకాల పంటలకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చాక మాట మార్చింది. సన్నాలకు మాత్రమే ఇస్తామని స్పష్టం చేసింది. ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,320, కామన్ గ్రేడ్ రకానికి రూ.2,300 మద్దతు ధర కల్పించనుంది. సన్న ధాన్యం క్వింటాల్‌కు బోనస్ రూ.500 కలిపి రూ.2,820 కట్టించనున్నారు. 33 రకాల సన్నాల్లో బీపీటీ 5204, ఆర్‌ఎన్‌ఆర్ 15048, హెచ్‌ఎంటీ, సోనా, జైశ్రీరాం వంటి రకాలు ఉన్నాయి. సన్నాలకు మాత్రమే బోనస్ ఇవ్వనుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మొత్తం నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ అనుకున్నా బోనస్ లేకపోవడంతో రైతులు 200కోట్ల వరకు కోల్పోనున్నారు.

# అభివృద్ధికి నిధులు తేలేని దద్దమ్మ రాజగోపాల్‌రెడ్డి

- మునుగోడు ప్రజలను మోసం చేస్తున్న గోల్‌మాల్ గోపాలం
- మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

చండూరు, మే 10 : ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు తేలేని దద్దమ్మ అని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. చండూరులో నత్తనడకన సాగుతున్న రోడ్డు విస్తరణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. అంతకు ముందు వ్యవసాయ మార్కెట్ వద్ద నుంచి చండూరు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి కాదని.. ఆయన గోల్‌మాల్ రాజగోపాలం అని నినాదాలు చేశారు. అనంతరం ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు అలవిగాని హామీలు ఇచ్చి ఇప్పుడు ఏమీ చేయలేని రాజగోపాలం ఏ మొఖం పెట్టుకొని తిరుగుతున్నాడో ప్రజలకు చెప్పాలన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఏమీ చేయలేని అసమర్థ ఎమ్మెల్యే అని మండిపడ్డారు. నత్తనడకన సాగుతున్న రోడ్డు విస్తరణ పనుల వల్ల సంవత్సర కాలంగా చండూరు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు తీసుకొచ్చిన నిధులు తప్ప ఇప్పుడు ఒక్క రూపాయీ తేలేదని ఆరోపించారు. మునుగోడులో క్యాంపు కార్యాలయం తన హయాంలో కట్టించి ప్రారంభించిన శిలాఫలకాన్ని తీసేసి మళ్లీ ఆయన పేరుతో వేయడం సిగ్గుచేటు అన్నారు. రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవిపై ఉన్న శ్రద్ధ నియోజకవర్గంపై ఉంటే ఈ ప్రాంతం ఎప్పుడో అభివృద్ధి చెందేదని పేర్కొన్నారు. ఆయనకు దోచుకోవడం, దాచుకోవడం తప్ప అభివృద్ధిపై ధ్యాస లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన అన్న మంత్రిగా ఉన్నారు.. నిధులు తెచ్చి అభివృద్ధి చేయవచ్చుగా అని ప్రశ్నించారు. గతంలో పండిన పంటలో ఇప్పుడు 20శాతం కూడా పండలేదని, అయినా ధాన్యం కొనుగోలు చేయకుండా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని అన్నారు. ధాన్యం త్వరగా కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెండేండ్లు కాకముందే కాంగ్రెస్‌పై తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం రావాలని, కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కర్నాటి వెంకటేశం, మాజీ ఎంపీపీ తోకల వెంకన్న, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు బొమ్మరబోయిన వెంకన్న, పట్టణ అధ్యక్షుడు కొత్తపాటి సతీశ్, నాయకులు పాల్గొన్నారు.


మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న కూసుకుంట్ల

# భారత్ సైన్యానికి సంఘీభావం

- జవాన్లకు మద్దతుగా పలుచోట్ల ర్యాలీలు

ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా పాకిస్తాన్‌పై ధైర్యంగా పోరాడుతున్న భారత సైన్యానికి పౌర సమాజం మద్దతుగా నిలిచింది. పాక్ తీవ్రవాదులపై యుద్ధం సాగిస్తున్న భారత వీర జవాన్లకు సంఘీభావంగా శనివారం పలుచోట్ల ర్యాలీలు నిర్వహించారు. వీరమరణం పొందిన జవాన్లకు జోహార్లు అర్పించారు. తుంగతుర్తి మండల కేంద్రంలో జీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం నుంచి మహాత్మా గాంధీ విగ్రహం వరకు జాతీయ జెండాలు పట్టుకొని సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. అర్వపల్లి మండల కేంద్రంలోని భరద్వాజ ఆశ్రమంలో జవాన్లకు మద్దతుగా సుదర్శన విజయ నరసింహ హోమం నిర్వహించారు. కోదాడ పట్టణంలో వాకర్స్, వాలీబాల్, కబడ్డీ, షటిల్, బాల్ బ్యాడ్మింటన్, కరాటే క్రీడాకారులు ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సమీపంలో గాంధీ విగ్రహం వద్ద మానవహారం చేపట్టి సైనికులకు మద్దతుగా నినాదాలు చేశారు. దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దేవరకొండలో డిండి చౌరస్తా నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. పాక్ కాల్పుల్లో వీరమరణం పొందిన అమర జవాన్ మురళీనాయక్‌కు నివాళులర్పించారు. ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.


తుంగతుర్తిలో భారత్ సైన్యానికి మద్దతుగా సంఘీభావ ర్యాలీ

